# జాడలేని భూసార పరీక్షలు

- నాలుగేళ్లుగా చేపట్టని అధికారులు
- ఇష్టారీతిన ఎరువుల వినియోగం
- తగ్గుతున్న భూసారం, పంటల దిగుబడి

**పెన్‌పహాడ్ :** భూసారాన్ని తెలుసుకోవడంతోపాటు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పంట దిగుబడులను పెంచేందుకు చేపట్టాల్సిన భూసార పరీక్షలు నాలుగేళ్లుగా మండలంలో చేపట్టడం లేదు. రైతులు స్వల్ప పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ప్రభుత్వాలు పదే పదే చెబుతున్నాయి. నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలని సూచిస్తున్నాయి. అయితే ఇందులో ఎంతో కీలకమైన భూసార పరీక్షలు మాత్రం చేపట్టడం లేదు. మండలంలో ఏఈఓలకు కిట్లను అందజేసినా నాలుగేళ్లుగా భూసార పరీక్షల జాడలేకపోవడం గమనార్హం.

**పంటల దిగుబడిపై ప్రభావం..**

పెన్‌పహాడ్ మండల వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో సుమారు 35వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతుతాయి. గతంలో ఏఈఓల ద్వారా వేసవిలో భూసార పరీక్షలు చేసేవారు. ఆ ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటల సాగుకు ప్రాధాన్యం ఇచ్చేవారు. అయితే నాలుగేళ్లుగా ఆ



పెన్‌పహాడ్ రైతు వేదిక కార్యాలయం

ఊసే లేకపోవడంతో రైతులు ఇష్టారీతిన ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో ఏటా నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో పదెకరాలకు ఒక మట్టి నమూనా, వర్షాధారిత ప్రాంతాల్లో 25 ఎకరాలకు ఒక మట్టి నమూనా సేకరించి పరీక్షలు చేసి నేల పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేవారు. తదనుగుణంగా రైతులు ఎరవులను వాడేవారు. అయితే నాలుగేళ్లుగా భూసార పరీక్షల కార్యాచరణను రూపొందించటం లేదు.

**నిరుపయోగంగా మారిన పరికరాలు...**

ప్రభుత్వం 2018లో భూసార పరీక్షలను ప్రారంభించగా 2020 వరకు సజావుగా సాగాయి. ఇందు కోసం రూ.1.30లక్షల విలువైన ఒక్కో కిట్టును ఏఈఓలకు అందించారు. అప్పట్లో రైతు వేదికలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉంచారు. రైతు వేదికలను నిర్మించిన తరువాత వాటిని అందులోకి మార్చారు. కానీ నాలుగేళ్లుగా భూసార పరీక్షలు నిర్వహించడంలేదు. ఇప్పటికైనా భూసార పరీక్షలు చేపట్టి నేల పరిస్థితులు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు**



భూసార పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులు భూసార పరీక్షలు చేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం సూచించిన వెంటనే మట్టి నమూనాలను సేకరిస్తాం. నేల స్వభావం బట్టి ఎరువుల వాడకంపై రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తాం.

– అనిల్‌కుమార్, ఏఓ

## వైభవంగా నారసింహుడి నగరోత్సవం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**తాళ్లగడ్డ (సూర్యాపేట):** చివ్వెంల మండలం ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం సూర్యాపేట పట్టణంలోని సంతోషిమాత ఆలయం నుంచి కొత్తబస్టాండ్ వరకు స్వామివారి నగరోత్సవం (శోభాయాత్ర) వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తుల కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. జయంతి ఉత్సవాలు 12వ తేదీ వరకు కొనసాగుతాయని ఉండ్రుగొండ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చకిలం కృష్ణకుమార్, గిరిదుర్గం అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆదుర్తి రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బందకవి కృష్ణమోహన్, కలకోటి నర్సయ్య, చింతల మల్లయ్య, ఆకారపు మురళి కష్ణ, కట్టకోల గోపాల కిషన్‌రావు, ఆకారపు మురళీకష్ణ, వాసా కృష్ణ, బోనగిరి విజయ్ ఉమార్, పబ్బ ప్రకాష్, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, మహేశ్వరం రవిచంద్ర, చకిలం వెంకటేశ్వర రావు, చకిలం నిర్మల, గుండా శ్రీనివాస్, గోపారపు రాజు, వనమాల భిక్షపతి, పోతుగంటి శంకర్, అబ్బూరి వినోద్, బొబ్బిలి శ్రీనివాస్‌రెడ్డి, బచ్చు పురుషోత్తం, బజ్జూరి శ్రీనివాసు, అర్చకులు కృష్ణమాచార్యులు, యాదగిరి ఆచార్యులు, మనోహర శర్మ పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న మహిళా కోలాట బృందం

## శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**తాళ్లగడ్డ (సూర్యాపేట) :** సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు యజ్ఞాచార్యులు నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యులు సూర్యకిరణాల ద్వారా అగ్నిని ప్రజ్వలింప చేసి యాగశాలలోని యజ్ఞ కుండంలో అగ్నిని ప్రతిష్ఠించి మూలమంత్ర హోమాలు నిర్వహించారు. తదనంతరం ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం నిర్వహించి గరుడ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. సాయంత్రం యాగశాలలో హోమాలు నిర్వహించి దేవతాహ్వానం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి, తూడి దేవేందర్ రెడ్డి, ఝాన్సీ, లక్ష్మి, బజ్జూరి కృష్ణయ్య, రమేష్, మాధవ రావు, మంజుల, అరుణ, ఉమారాణి, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి భక్త బృందం పాల్గొన్నారు.

**నేడు శ్రీసుదర్శన నారసింహ యాగం..**

ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భారత సైనికులకు మద్దతుగా విజయసాధన కోసం శ్రీ సుదర్శన నారసింహ యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు తెలిపారు. భారతదేశ ప్రేమికులు ప్రతి ఒక్కరూ ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



గరుడ ముద్దలు ఎగరవేస్తున్న అర్చకుడు

## వన నర్సరీ పరిశీలన

**అర్వపల్లి :** వేసవిలో ఎండలకు వన నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ టి. గోపి కోరారు. లోయపల్లిలో గురువారం వన నర్సరీని పరిశీలించారు. కోమటిపల్లిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**నాగారం :** ఫణిగిరిలో శనివారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఫణిగిరి గ్రామానికి చెందిన గైగుల్ల ఉమేష్ తన ఎద్దులను వ్యవసాయ క్షేత్రానికి మేతకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ఎద్దు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

**పెన్‌పహాడ్ :** మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న దేశవ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ధనియాకుల శ్రీనివాస్, నకిరేకంటి నర్సయ్య, శ్రావణి, ఒగ్గు మట్టయ్య, సిలువేరు సైదులు, ఎల్లమ్మ, సత్తెమ్మ, నరేష్, రమణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**నూతనకల్ :** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు సత్యం కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పులసరి వెంకటముత్యం, బత్తుల రవి, సైదులు పాల్గొన్నారు.

## ‘గోపా’ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న బండి సాయన్న

**సూర్యాపేట అర్బన్ :** గోపా (గౌడ్ ఆఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్) బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ కోరారు. సూర్యాపేటలోని ఎస్ఎల్ఎస్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన గోపా జిల్లా కమిటీ నూతన ఎన్నిక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పేద గౌడ కుటుంబాల పిల్లలు విద్య, ఉపాధి అవకాశాలు పొందేలా గోపా కృషిచేస్తోందన్నారు. గోపా జిల్లా కన్వీనర్ అల్లాడి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారింగుల భిక్షమయ్య గౌడ్, చీకూరి సత్యం గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పులుసు సాయిబాబా గౌడ్, గుడిపూడి సాయి, వేణు గౌడ్, మీరయ్య గౌడ్, నాతి సవీందర్ గౌడ్, బూర సుధాకర్ గౌడ్, కొన్నె మంజుల గౌడ్, గుణగంటి సురేందర్ గౌడ్, కొత్త పుల్లయ్య గౌడ్, యమగాని సూర్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

గోపా జిల్లా అధ్యక్షుడిగా బూర రాములుగౌడ్, జిల్లా గౌరవ సలహాదారులుగా నాతి సవీందర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులుగా చీకూరి కృష్ణగౌడ్, గోపగాని గిరి గౌడ్, బండి సైదులుగౌడ్, నామాల గురుమూర్తి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా యరగాని లక్ష్మయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా రాపర్తి మహేష్‌గౌడ్, భూపతి నారాయణగౌడ్, దోరెపల్లి రమేష్‌గౌడ్, అంతటి వెంకన్నగౌడ్,కోశాధికారిగా ఐతగాని రాంబాబు గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మారగాని వెంకన్నగౌడ్, మారగాని శంకర్‌గౌడ్, మల్లం రమేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా ఐదుగురు నియమితులయ్యారు. వీరితో గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

## భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీలు, పూజలు



తుంగతుర్తిలో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న జీఆర్ ఫౌండేషన్ సభ్యులు



అర్వపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు

**సూర్యాపేట అర్బన్ :** పాకిస్తాన్‌పై వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా శనివారం సూర్యాపేటలోని కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద సూర్యాపేట ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నాయకులు సంఘీభావం తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శీను, మన్సూర్, ఖదీర్, వాసు, రాజు, సత్యం, లతీఫ్, నందు, మనో, బాలాజీ, భవాని, భాను, సత్తి, హైమద్, శేఖర్, కీర్తి, అనిష్, రఘు, ప్రసన్న, సోము తదితరులు పాల్గొన్నారు.

**తుంగతుర్తి :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌పై ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా శనివారం జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు జాతీయ జెండాలను చేత పట్టుకుని ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గోపగాని రమేష్ గౌడ్, తాటికొండ సీతయ్య, గుండగాని రాములు గౌడ్, పెద్దబోయిన అజయ్, పాలవరపు సంతోష్, కాసం మల్లయ్య, పులిపంపుల సైదులు గౌడ్, గాజుల మహేందర్, కటకం వెంకటేశ్వర్లు, లాకవత్ యాకునాయక్, ఎనగందుల గిరి, గోపగాని శ్రీను, గోపగాని వెంకన్న, పోలేపల్లి అశోక్, నల్లబెల్లి వెంకటేష్, ఉప్పుల నాగమల్లు, లాలు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



భరద్వాజ ఆశ్రమంలో హోమం చేస్తున్న అర్చకులు

**అర్వపల్లి :** పాకిస్తాన్‌పై భారత్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా అర్వపల్లిలో వర్తక, వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చిల్లంచర్ల విద్యాసాగర్, ఈదుల వీరపాపయ్య, శ్రావన్, గోవర్ధన్, వెంకన్న వేణు, శ్రీనివాస్, గోపి, జహంగీర్, వెంకటేశ్వర్లు, సతీష్ ఉమ్మయ్య, శ్రీనివాస్, వ్యాపారులు పాల్గొన్నారు.

**సుదర్శన నారసింహ హోమం**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా అర్వపల్లిలోని భరద్వాజ ఆశ్రమంలో అర్చకుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్ ఆధ్వర్యంలో శనివారం సుదర్శన విజయ నారసింహ హోమం నిర్వహించారు. సైన్యానికి ఆత్మస్థైర్యం కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. పాకిస్థాన్‌పై భారతసైన్యం విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబు, పవన్‌కుమార్, రామకృష్ణ చక్రవర్తి, మాజీ ఎంపీటీసీ రమావత్ శంకర్ పాల్గొన్నారు.

## దిగుమతుల్లో జాప్యం.. రోడ్లపైనే నిరీక్షణ



ధాన్యం దిగుమతులు కాక సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై బారులుదీరిన లారీలు

**నాగారం :** నాగారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు మిల్లుల్లో సకాలంలో ధాన్యం దిగుమతులు కాకపోవడంతో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై వాహనాలు బారులుదీరాయి. మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించగా అక్కడ హమాలీల కొరతతో సకాలంలో దిగుమతులు కావడంలేదు. దీంతో వాహనాలు రోజుల తడబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనాలు మిల్లుల వద్ద వేచి ఉంటుండటంతో ఐకేపీల్లో కాంటాలు అయిన ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత ఏర్పడుతోంది. అలాగే కాంటాలు సైతం ఆలస్యమవుతుండటం, వాతావరణం వర్షాలు పడేలా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు



మద్దిరాలలో మైనర్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నర్సింహారావు, ఎస్ఐ వీరన్న



నాగారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైనర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రఘువీర్‌రెడ్డి

**మద్దిరాల :** మైనర్లకు వాహనాలు ఇస్తే మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని సీఐ నర్సింహారావు అన్నారు. తుంగతుర్తి సర్కిల్ పరిధిలోని మద్దిరాల, నూతనకల్ మండలాల పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లను, వారి తల్లిదండ్రులను పిలిపించి శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎం.వీరన్న, క్రాంతి కుమార్, గోపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నాగారం :** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకొని, వారి వాహనాన్ని సీజ్ చేస్తామని సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. నాగారం సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి, అర్వపల్లి, నాగారం మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వారం రోజుల వ్యవధిలో మూడు మండలాలకు సంబంధించి 40 మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎస్ఐలు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీవీ రావుకు ఘన నివాళి

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన నిలయంలో శనివారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పీవీ రావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సాలే రామారావు, జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు పోతుల జ్ఞానయ్య, రాష్ట్ర నాయకులు తుమ్మల రాంబాబు, చప్పిడి సావిత్రి, మండల అధ్యక్షుడు పి.రాజు, వినోద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



నాగారంలో బడిబాట ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మద్దిరాల: ముకుందాపురంలో బడిబాట కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కాట్ల రవికుమార్

**నాగారం :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జ్ఞానేశ్వరచారి అన్నారు. శనివారం నాగారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో బడి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం రాందాస్‌నాయక్, ఎస్ఎంసీ చైర్మన్ చిప్పలపల్లి మల్లేష్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మద్దిరాల :** విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ కాట్ల రవికుమార్ అన్నారు. శనివారం ముకుందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిబాటకు చెందిన కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నగేష్, ఉపాధ్యాయులు రేపాక లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పాల్వాయి నాగయ్య, ఉప్పు కృష్ణయ్య, బైరు తిరుమలేష్, కొరివి మధు, అలీముద్దీన్, బుస్సా వెంకటేశ్వర్లు, విజయ్ పాల్గొన్నారు.

**అర్వపల్లి :** అర్వపల్లిలో ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పిల్లలను స్థానిక ప్రాథమిక పాఠశాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం యాకలక్ష్మి, ఉపాధ్యాయులు కుంభం రేణుక, భూపతి స్వరూపరాణి, శైలజ పాల్గొన్నారు.

**సర్కార్ బడికి రావాలని వినూత్న ప్రచారం**

విద్యార్థులు సర్కార్ బడికి రావాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరుతూ ఓ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి మల్లేష్ తన ద్విచక్ర వాహనానికి సౌండ్ బాక్స్ అమర్చుకొని గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. టెన్త్ ఫలితాలలో అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ 100శాతం ఉత్తీర్ణత సాధించి నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, పాఠశాల విద్యార్థిని 562 మార్కులు సాధించిందని వివరిస్తూ ఆడియో ఏర్పాటు చేయించి సౌండ్ బాక్స్ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. దీంతో ప్రజలు ఆడియోను ఆసక్తిగా వింటున్నారు. శనివారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం, సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని వివిధ గ్రామాలలో ద్విచక్ర వాహనంపై తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



అర్వపల్లిలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



ద్విచక్రవాహనంపై సౌండ్ బాక్స్ అమర్చుకొని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడు మల్లేష్

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**మునగాల :** రాష్ట్రంలో డిగ్రీ విద్య నభ్యసిస్తున్న 8 లక్షల మంది విద్యార్థులకు గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని మండల కేంద్రానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్య గౌడ్ కోరారు. ఈమేరకు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన ఈ–మెయిల్ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజులు చెల్లించకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు నిలిపివేశాయని తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది డిగ్రీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న దాదాపు 3లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాయకముందే ఎడ్‌సెట్, లాసెట్, పీజీ సెట్ ప్రవేశ పరీక్షలు రాయాల్సి వస్తున్నందున తీవ్ర ఆవేదనకు గురువుతున్నారని తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు చొరవ తీసుకోవాలని మంగయ్యగౌడ్ కోరారు.

## తోపుడుబండ్ల తొలగింపు



రోడ్డుపై దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

**అర్వపల్లి :** అర్వపల్లిలోని వై జంక్షన్‌లో తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, జనగామ, సూర్యాపేట వైపు రోడ్డు వెంట ఉన్న పండ్ల దుకాణాలు, తోపుడుబండ్లను శనివారం సూర్యాపేట స్పెషల్ పార్టీ పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సహకారంతో తొలగించారు. రోడ్డును ఆక్రమించి ఈ దుకాణాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలగడంతోపాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. ఎవరైనా రోడ్డును ఆక్రమించుకొని దుకా ణాలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ, స్థానిక పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శాంతి భద్రతలతోనే గ్రామాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎస్ఐ బాలకృష్ణ

**అర్వపల్లి :** శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాలు, బెట్టింగ్, గంజాయి, మత్తు పదార్థాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీస్ అధికారి సతీష్, సిబ్బంది నాగయ్య, రవినాయక్, సతీష్, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్, యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### వేసవి శిక్షణ శిబిరం పరిశీలన



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో వాలీబాల్ ఆడుతున్న బాలికలతో ఎంఎన్ఓ, పీడీ

**అర్వపల్లి:** అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా యువజన క్రీడల సమాఖ్య, పాఠశాల విద్యాశాఖల ఆధ్వర్యంలో వేరువేరుగా నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరంను శనివారం మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ పరిశీలించారు. వేసవిలో బాలబాలికలు ఎండలలో తిరగకుండా ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళలలో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీ, క్యాంప్ ఇన్‌చార్జ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, బాలబాలికలు పాల్గొన్నారు.

### సీపీఎం నాయకుడు మృతి

**తిరుమలగిరి :** తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు హుస్సేన్‌అలీ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. అతడి మృత దేహాన్ని సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వనం సోమయ్య, బందెల అబ్రహం, రాంపల్లి వెంకటయ్య, సోమయ్య తదితరులు ఉన్నారు.

### విజయసేనారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న చెవిటి వెంకన్న యాదవ్

**తుంగతుర్తి :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విజయసేనారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం కేతిరెడ్డి విజయసేనారెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని రావులపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేతినేని శ్రీనివాస్, సుధాకర్, బాబు వెంకన్న, రామచంద్రు పాల్గొన్నారు.

### వీర జవాన్‌కు నివాళి

**నడిగూడెం:** భారత్, పాకిస్తాన్ యుద్ధంలో వీర మరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి శనివారం నడిగూడెంలో యువత నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పందిటి నవీన్‌కుమార్, బాణాల నాగరాజు, ఎండీ.రఫీ, దున్నా ప్రవీణ్, షేక్.ఇంతియాజ్, మేకల వీరయ్య, చింతల రమేష్, పల్లపు నాగేశ్వరరావు, అంజన్, వినయ్, వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజు, హైమద్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

**మునగాల :** ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం కోదాడకు చెందిన కె.నరేష్ (పోలీస్) పుట్టిన రోజుతో పాటు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన కె. గోపి–శ్రావణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ, దాతలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు